క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 33, 34వ వార్డుల పరిధి 11 కేవీ విద్యుత్ హెచ్‌టీ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొబ్బరితోట, జెండాచెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరెళ్లకోనేరు, కర్ణాలవీధి, అల్లిపురం రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

గంజాయి నిందితుల అరెస్ట్

అల్లిపురం: గంజాయి కలిగివున్న ఇద్దర్ని టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వీవీసీఎం యర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16వ తేదీ రాత్రి బౌడరారోడ్డులో గల జెమిని లాడ్జిలో తనిఖీలు చేస్తున్న సమయంలో ఒడిశా, నవరంగ్‌పూర్‌కు చెందిన ధాను బర్దర, ఖగస్ చంద్రసైన్‌ల వద్ద సుమారు 19 కేజీల గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడితో భేటీ



ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన ఎస్సీ సంఘాల నాయకులు, బీజేపీ నేతలు

డాబాగార్డెన్స్: జాతీయ ఎస్సీ కమిషనర్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖ పర్యటన నిమిత్తం గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి నుంచి వచ్చిన ఎస్సీ సంఘం సీనియర్ నాయకుడు బొమ్మి శ్రీహరిరావు, బీజేపీ ఉపాధ్యక్షులు చొక్కాకుల రాంబాబు, కొప్పుల రామ్‌కుమార్, మైనార్టీ మోర్చా సీనియర్ నాయకుడు సీహెచ్ రాజబాబు, దశమంతుల సుశీల, జి. రమా, దశమంతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజారావు మృతికి సంతాపం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం గెడ్డవీధిలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాత్రపల్లి సునీల్‌కుమార్ తండ్రి, పార్టీ కార్యకర్త పాత్రపల్లి రాజారావు వర్ధంతిని పురస్కరించుకుని స్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్‌లు రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ హాజరైన వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం వేశంగిబిరావు, దాలిబాని మధు, పోలమరశెట్టి విక్రాంత్, బోగాధి ఆనందరావు తో పాటు కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ప్యాకెట్ల స్వాధీనం

అల్లిపురం: గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెట్రోలింగ్‌లో భాగంగా బిర్లా జంక్షన్ బస్ స్టాప్ వద్ద ఇమ్రాన్ బేగ్, అఫ్సర్ బాషాల వద్ద రెండు ప్యాకెట్ల గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశాలోని బరంపురం నుంచి రూ.400, రూ.300 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, తాము వినియోగించగా మిగిలిన దానిని అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం గోపాలపట్నం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

పీ-4 వెలుగులు ఇంకెప్పుడు?

- ఆశగా ఎదురుచూస్తున్న పేదలు
- రీ వెరిఫికేషన్ అంటూ మళ్లీ సర్వే
- సర్వేలతోనే సరిపెడుతున్నారని నిట్టూర్పు



పీ 4 సర్వే చేస్తున్న కార్యదర్శులు

జగదాంబ: పేదల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన పీ - 4 (పబ్లిక్ - పీపుల్ - ప్రైవేట్ - పార్ట్‌నర్‌షిప్) వెలుగుల కోసం దక్షిణ నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని 15 వార్డుల్లో 2 లక్షల 17వేల 400 మంది జనాభా నివసిస్తున్నారు. నగరపరిధిలో 'దక్షిణం'లోనే మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలు, తోపుడుబండ్ల వ్యాపారులు, చిరువ్యాపారులు ఎక్కువమంది జీవనం సాగిస్తున్నారు. పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన పీ-4 సర్వే ప్రారంభమై నెలలు గడిచిపోతున్నాయి. తమ జీవితాల్లో వెలుగులు విరబూస్తాయనే ఆశతో సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఈ సర్వేలో వేలాది మంది చిరువ్యాపారులు, నిరుద్యోగులు, మహిళలు సర్వేలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ కనుచూపు మేరలో ఆ అవకాశాలు కానరాక నిరాశ చెందుతున్నారు.

రీ వెరిఫికేషన్ సర్వే..

దక్షిణ నియోజవకర్గంలో పీ-4 సర్వేలో 9వేల మందిని ఇప్పటి వరకు గుర్తించారు. కొద్దిరోజులుగా మళ్లీ రీ వెరిఫికేషన్ సర్వే జరుగుతోంది. వారు నిజంగా పేదలేనా, వారి అవసరాలేమిటి? పేదలకు ఏం కావాలో తెలుసుకునేందుకు గాను మళ్లీ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రీ వెరిఫికేషన్ సర్వే అనంతరం దాతల ద్వారా వారికి సహకారం అందించనున్నారు. నెలల తరబడి సర్వే లే జరుగుతున్నాయి. ఇలా సర్వేలతో కాలయాపన చేయకుండా త్వరితగతిన పేదలకు లబ్ధి చేకూర్చాలని నియోజకవర్గవాసులు కోరుతున్నారు.



రీ వెరిఫికేషన్ పేరుతో ఇంటింటా సర్వే చేస్తున్న కార్యదర్శులు

అర్హులుంటే నమోదు చేసుకోవాలి

దక్షిణ నియోజకవర్గ పరిధిలో 9వేల మందిని సర్వే చేశాం. ప్రస్తుతం రీ వెరిఫికేషన్ సర్వే జరుగుతోంది. సచివాలయాల్లో డిస్‌ప్లే పెడతాం. అభ్యంతరాలున్నా, ఇంకా సర్వేలో నమోదు కాకపోయినా వచ్చి నమోదు చేసుకోవాలి. - మల్లయ్యనాయుడు, జోనల్ కమిషనర్, జోన్-4

త్వరగా సాయం అందించాలి

చిరువ్యాపారం చేసుకుని రోజులు గడుపుతున్నాం. సర్వేలకు ఎప్పుడు వస్తారో అని పనులు మానుకుని ఇళ్ల వద్ద ఉండాల్సి వస్తోంది. ఇలా అయితే మాకు రోజులెలా గడుస్తాయి. ఇలా జాప్యం జరగడం వల్ల కాలం వృథా అయిపోతోంది. ప్రభుత్వం, అధికారులు మా పరిస్థితి అర్థం చేసుకోవాలి. మా ఆర్థిక పరిస్థితి గుర్తించి మాకు సాయం అందించాలి.
-నూకరాజు, తోపుడు బండి వ్యాపారి, పూర్ణామార్కెట్

ఎస్సీ కమిషన్ ఆదేశాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేసేందుకు వెళ్తున్న విదసం నేతలు

బీచ్‌రోడ్డు: ఎస్సీ కమిషన్ ఆదేశాలను పాటించని అధికారులపై అట్రాసిటీ చట్టం సెక్షన్ 4 కింద కేసులు నమోదు చేయాలని, అలాగే తెనాలి, మల్లం, విశాఖ జైలు డెత్ ఘటనల్లో దోషులను కాపాడుతూ కమిషన్ ఆదేశాలను ఖాతరు చేయని ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని విదసం ఐక్య వేదిక జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రకు ఫిర్యాదు చేసింది. నగరానికి వచ్చిన ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను హెచ్‌సీఎల్ గెస్ట్ హౌస్‌లో మల్లం మృతుడు సురేష్ భార్య మణి, కస్టోడియల్ మృతుడు తల్లి ఉప్పాడ నర్సయ్యమ్మ, గుడ్డిప అసైన్డ్ భూ బాధితులతో కూడిన విదసం నాయకులు కలిసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు మాట్లాడుతూ తెనాలిలో దళిత యువకులను నడిరోడ్డుపై కొట్టిన ఘటనలో పోలీసులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహించడం సరికాదన్నారు. మల్లంలో సాంఘిక బహిష్కరణ జరిగితే కనీసం కేసు కూడా నమోదు చేయలేదని, గత ఏడాది విశాఖ సెంట్రల్ జైల్లో జరిగిన గౌరీ శంకర్ కస్టోడియల్ డెత్ విషయంలో బాధ్యులపై నేటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ ఘటనలపై కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జైలు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లం మృతుడు సురేష్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు కేటాయించాలని కమిషన్‌ను కోరామని డాక్టర్ బూసి వెంకట రావు తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై కమిషన్ ఇచ్చే ఆదేశాలను ఉల్లంఘిస్తే అధికారులను సమన్ చేసే అధికారం కమిషన్‌కు ఉందన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని, వారిపై సెక్షన్ 4 ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాజి ఓంకార్, బూల భాస్కర రావు, గుడివాడ ప్రసాద్, వడ్ల మురి ఫ్రాన్సిస్, అలమండ మంగ రాజు, గార బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న యువత

బీచ్‌రోడ్డు: దేశంలో నెలకొన్న తీవ్ర రక్త కొరతను అధిగమించడానికి యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ పిలుపునిచ్చారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో నేర్కోడ్, వీఎంఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేర్కోడ్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించిన ప్రణవ్ గోపాల్, వివిధ వ్యాధులు వ్యాపిస్తున్న ప్రస్తుత తరుణంలో రక్తదాన కేంద్రాల్లో ఏర్పడిన కొరతను తీర్చడానికి నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నేర్కోడ్), వీఎంఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ, రెడ్ క్రాస్, అపోలో సహకారంతో మెగా వైద్య రక్తదాన శిబిరాన్ని చేపట్టడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేర్కోడ్ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ, ఈ మెగా వైద్య శిబిరంలో రక్తదానంతో పాటు బీపీ, షుగర్ వంటి పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేర్కోడ్ జోన్ ప్రెసిడెంట్ ఏ రమేష్ బాబు, జనరల్ సెక్రెటరీ దండమూడి పాపారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఏ హుస్సేన్, వైవీ చౌదరి, అడ్వైజర్ కమిటీ చైర్మన్ చోడే పట్టాభిరామ్, చీఫ్ పాట్రన్ తాళ్లూరి పూర్ణచంద్రరావు, ట్రెజరర్ కేవీవీ సుబ్బారావు, పోలమాంబ ఆలయ కమిటీ చైర్మన్ బైరెడ్డి పోతన్ రెడ్డి, నేర్కోడ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువతను అభినందించి, వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.

26, 27 తేదీల్లో సిటూ విశాఖ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్: సిటూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో కంచరపాలెం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. గురువారం సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన వివిధ కార్మిక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, ఉద్యోగ భద్రత, అసంఘటిత రంగ కార్మికుల ఉపాధి రక్షణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం, వివిధ షాపులు, హోటల్స్, హాస్పటల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న చిల్లర వర్తకులు, ఆటో, మోటార్, రవాణా రంగ కార్మికుల హక్కుల గురించి, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, పాత పెన్షన్ స్కీం అమలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులను మంత్రముగ్ధులను చేయాలి



ఏయూలో ప్రసంగిస్తున్న గ్లెన్ హెడెన్

మద్దిలపాలెం : అధ్యాపకులు సమర్థవంతంగా సంభాషించాల్సిన చాతుర్యం అలవరచుకోవాలని ఆస్ట్రేలియాకు చెందిన అంతర్జాతీయ రంగస్థల ప్రముఖుడు గ్లెన్ హెడెన్ సూచించారు. ఏయూ విద్యా విభాగంలో 'టీచర్ యాజ్ ఏ పెర్ఫార్మర్' అనే అంశంపై గురువారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అధ్యాపకులు వారి డైనమిక్ పాత్రను హైలైట్ చేసుకుంటూ విద్యార్థులను మంత్రముగ్ధులను చేయాలన్నారు. తరగతి గది బోధనలో వాయిస్ మాడ్యులేషన్, బాడీ లాంగ్వేజ్‌తోపాటు కథ చెప్పడం ప్రాముఖ్యతను వివరించారు. విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారన్ రాజు, డాక్టర్ చల్లా క్రిష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా 58 అడుగుల విగ్రహం

శాఖమూరు పార్కులో ఏర్పాటుకు చర్యలు

డాబాగార్డెన్స్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 58 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయనుందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప తెలిపారు. గురువారం డాబాగార్డెన్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు అమరావతిలోని శాఖమూరు పార్కులో 6.8 ఎకరాల స్థలాన్ని సీఆర్‌డీఏ ద్వారా అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు ప్రభుత్వం కేటాయించిందని రూప పేర్కొన్నారు. తెలుగుజాతి గరివ్వందగ్గ పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని వచ్చే ఏడాది మార్చి 16న శ్రీరాములు జయంతి నాటికి పూర్తి చేయాలని సంకల్పించినట్లు ఆమె తెలిపారు. ఇటీవల మంత్రి నారాయణ చేతుల మీదుగా భూమి కేటాయింపు పత్రాలను అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు దూండి రాకేష్ స్వీకరించారన్నారు.

నైట్ షెల్టర్‌ను సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి



వసతిగృహ సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసిరావు

అల్లిపురం: ఏయూటీడీ నడుపుతున్న జీవీఎంసీ టీఎస్సార్ కాంప్లెక్స్ డే అండ్ నైట్ షెల్టర్లను విశాఖ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసిరావు గురువారం సందర్శించారు. శ్రద్ధ ఫౌండేషన్, ముంబయి సహకారంతో చికిత్స పొందుతున్న 92 మంది నిరాశ్రయులు, మానసిక రోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు మందులు సరిగ్గా వాడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం, మిగిలిన సదుపాయాల గురించి ఆరా తీశారు. బిల్డింగ్ నాణ్యత, రిపేర్లు చూసుకుని నడపాలని సూచించారు. షెల్టర్ కిచెన్ ద్వారా మూడు పూటలా భోజనం అందిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏయూటీడీ కార్యదర్శి ప్రగడవాసు, జ్యోతిర్మయి, లీలా, శ్రీనివాస్, శ్రద్ధ సోషల్ వర్కర్స్ గౌతం, హరీష్ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.14.98 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 21 రోజులకు గాను రూ.14,98,503 నగదు, 1.47 గ్రాముల బంగారం, 207 గ్రాముల వెండి లభించింది. అలాగే 8 యూఎస్‌ఏ డాలర్లు, 5 కెనడా డాలర్స్, ఒకటి ఖతార్ రియాల్ వచ్చినట్టు సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు, ఆలయ వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. లెక్కింపులో శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, తనిఖీదార్ ఎం.శ్రీధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడి చెంతకు గౌతమ్..



గౌతమ్‌ను ట్రైన్ ఎక్కించి హైదరాబాద్ పంపుతున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యుడు

అల్లిపురం: ఆరు నెలల క్రితం విశాఖ సెంట్రల్ పార్క్ వద్ద గ్రహణం మొర్రితో సరిగా మాట్లాడలేక పడి ఉన్న ఏలూరుకు చెందిన గౌతమ్..టూటౌన్ పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది కృషితో పూర్తి ఆరోగ్యంతో కోలుకుని తన సోదరుడి వద్దకు చేరాడు. గౌతమ్‌ను గుర్తించిన టూటౌన్ పోలీసులు వెంటనే ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అతనికి జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. మానసిక సమస్యలు, మత్తుకు బానిసైన గౌతమ్‌కు చికిత్స అందించడంతో అతను సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకున్నాడు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత గౌతమ్ తన తమ్ముడి ఫోన్ నంబర్‌ను చెప్పడంతో, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు అతడితో మాట్లాడారు. గురువారం గౌతమ్‌ను రైలు ఎక్కించి హైదరాబాద్‌లోని తన తమ్ముడి వద్దకు పంపించారు.

కేజీహెచ్‌లో ఆధునిక యూరాలజీ పరికరాల ప్రారంభం



అత్యాధునిక యూరాలజీ పరికరాలు ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వాణి

డాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో నూతనంగా సమకూర్చిన అత్యాధునిక యూరాలజీ పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి ప్రారంభించారు. ప్రభుత్వం మంజూరు చేసిన 4కే లాప్రోస్కోపీ సిస్టమ్స్, థ్యూలియం, హోల్మియం లేజర్‌లు, యూరోడైనమిక్స్ యంత్రాలు ఇక నుంచి కేజీహెచ్‌లోని యూరాలజీ విభాగంలో అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. ఈ అత్యాధునిక పరికరాల ద్వారా మూత్రపిండ రాళ్లు, ప్రోస్టేట్ సమస్యలు, స్ట్రిక్చర్‌లు, మూత్రపిండ మార్పిడి వంటి శస్త్రచికిత్సలను తక్కువ సమయంలో, తక్కువ రోజులు ఆస్పత్రి ఉండే విధంగా విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఐ.చంద్రశేఖర్, యూరాలజీ వైద్యులు, అనస్థీషియా శాఖ సిబ్బంది, నర్సింగ్, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో ఘనుడు చంద్రబాబు

- ఇప్పటికైనా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి
- బాబు 'ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో వాసుపల్లి గణేష్‌కుమార్



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి తదితరులు

అల్లిపురం: దగా, మోసం, వెన్నుపోటులో టీడీపీ అధినేత చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం ఉందని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. 32వ వార్డు అధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అండ్ కో మోసాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవంతో ప్రజలకు 'సూపర్ సిక్స్' హామీలు ఇచ్చి సుమారు ఏడాదిన్నర గడిచినప్పటికీ, ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీల్లో కూడా కోతలు విధించి సగం మంది అర్హులైన పేదలకు వాతలు పెట్టారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే తలమానికంగా నిలిచాయని వాసుపల్లి ప్రశంసించారు. కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్య సేవలను పేదలకు అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. 'నాడు-నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని, అలాగే సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందజేసి రెండున్నర లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లోకి చేరవేశారని గుర్తు చేశారు. కరోనా విపత్కర సమయాల్లో కూడా జీడీపీ రేటు దిగువకు రాకుండా జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన విధానంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించారని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే లక్షన్నర కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. మత్స్యకారులకు అందించిన భరోసాలో కూడా తమ నియోజకవర్గంలో అనేక మందిని అనర్హులను చేసి మోసం చేశారని వాసుపల్లి విమర్శించారు. మత్స్యకార వర్గాన్ని నీచంగా చూసిన చంద్రబాబుకు గతంలో గట్టి బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదన్నారు. అత్యధిక పేదలు, ముస్లిం మైనారిటీలు, అట్టడుగు కులాలు ఉన్న తమ నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని వాసుపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి రామానంద్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, రాష్ట్ర ప్రజా విభాగం సెక్రటరీ రాజా బత్తుల భానుమూర్తి, సౌత్ అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడు కొణతాల కృష్ణవేణి, వార్డు యూత్ అధ్యక్షుడు కోటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సురపతి అప్పన్న, బాబుల శ్రీను, ఆదిబాబు, కుమారి, గోవిందు, గరికిన ఎల్లాజీ, జ్యోతి, నాగమణి, శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి



హెచ్‌బీ కాలనీలో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో డ్రైవర్లు

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవిందు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఆటోలతో డ్రైవర్లు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వాహన మిత్ర అమలుతోపాటు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటిపోయినా పథకాలు అమలు చేయలేదన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నామన్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు జీవో. 21, 31 జారీ చేసిన ప్రభుత్వం డ్రైవర్లపై అక్రమ కేసులు బనాయిస్తూ వాహనాలను సీజ్ చేయించడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అడ్డూరు శంకర్, ఎన్.మధు రెడ్డి, లంక గోవింద్, పి.క్రిష్ణం నాయుడు, శ్రీను, దల్లి నాని, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌కు అభినవ్‌రెడ్డి



డాబాగార్డెన్స్ : ప్యారిస్ నగరంలో ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌లో నగరానికి చెందిన పన్నెండేళ్ల అభినవ్‌రెడ్డి భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంటర్మీడియట్ విభాగంలో ఫైనల్స్‌లో పోటీపడుతున్న అభినవ్ దేశ వ్యాప్తంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సవాల్‌కు సిద్ధమవుతున్న అభినవ్ ప్రయాణం యువ అభ్యాసకులకు ప్రేరణగా నిలుస్తోంది.